పరీక్ష కేంద్రాల వారీగా ఫలితాలు

- నీట్-యూజీపై ఎన్‌టీఏకు సుప్రీంకోర్టు ఆదేశం
- ఈ నెల 20 లోగా ప్రకటించాలని గడువు
- విస్తృత స్థాయిలో పరీక్ష పవిత్రత దెబ్బతిన్నట్టు నిర్ధారణ అయితేనే రీటెస్ట్
- తదుపరి విచారణ ఈ నెల 22కు వాయిదా

న్యూఢిల్లీ, జూలై 18: నీట్-యూజీ పరీక్ష ఫలితాలను పరీక్ష కేంద్రాలు, నగరాల వారీగా ప్రకటించాలని జాతీయ పరీక్ష సంస్థ(ఎన్‌టీఏ)ను సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. ఇందుకు గానూ జూలై 20 మధ్యాహ్నం 12 గంటల వరకు గడువు ఇచ్చింది. అయితే, అభ్యర్థుల గుర్తింపును మాత్రం గోప్యంగా ఉంచాలని సూచించింది. నీట్-యూజీలో అక్రమాలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ పీబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పూర్తిస్థాయిలో పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదని ఒక బలమైన నిర్ధారణకు వస్తేనే మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశిస్తామని కోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. పట్నా, హజారీబాగ్‌కు మాత్రమే ప్రశ్నాపత్రం లీకేజీ పరిమితం అయినట్టు ప్రాథమికంగా కనిపిస్తున్నట్టు ధర్మాసనం పేర్కొన్నది. గోద్రాలో మాత్రం ఒక వ్యక్తి పలువురు అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లలో సమాధానాలు రాసేందుకు డబ్బులు తీసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయని తెలిపింది. నీట్-యూజీలో అక్రమాలపై విచారణ జరుపుతున్న సీబీఐ కోర్టుకు తెలిపిన వివరాలను బయటకు వెల్లడించలేమని, ఇలా చేస్తే విచారణపై ప్రభావం పడుతుందని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై విచారణను జూలై 22కు కోర్టు వాయిదా వేసింది.

నీట్ అక్రమాల కేసు వాదనలు వింటున్న సీజేఐతో కూడిన ధర్మాసనం

నలుగురు ఎంబీబీఎస్ విద్యార్థుల అరెస్ట్

నీట్-యూజీ పేపర్ లీక్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ బుధవారం పాట్నా, ఎయిమ్స్ ఎంబీబీఎస్ విద్యార్థులు నలుగురిని అరెస్ట్ చేసింది. వీరిలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న చందన్ సింగ్, రాహుల్ అనంత్, కుమార్ షాను, రెండో సంవత్సరం విద్యార్థి కరన్ జైన్ ఉన్నారు. వారుంటున్న హాస్టల్ రూమ్‌లను సీబీఐ అధికారులు సీజ్ చేశారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి సీబీఐ ఇప్పటివరకు ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. కాగా హజారీబాగ్‌లో ఎన్‌టీఏ ట్రంక్ పెట్టె నుంచి పరీక్ష పేపర్ అపహరించిన పంకజ్ కుమార్ అలియాస్ ఆదిత్య అనే సివిల్ ఇంజనీర్, పేపర్ అపహరణలో అతనికి సహకరించిన రాజు సింగ్ అనే వ్యక్తిని రెండు రోజుల క్రితమే సీబీఐ అరెస్ట్ చేసింది.

ఫాస్టాగ్ అమర్చని వాహనాలకు రెట్టింపు టోల్

న్యూఢిల్లీ, జూలై 18: ఉద్దేశపూర్వకంగా తమ వాహనాల ముందు భాగంలోని విండ్ షీల్డ్(అద్దం)కు ఫాస్టాగ్‌ను అతికించని వారి నుంచి రెట్టింపు టోల్ చార్జీలు వసూలు చేయాలని భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) గురువారం ఆదేశించింది. విండ్ షీల్డ్‌కు ఫాస్టాగ్ అతికించకపోవడం వల్ల టోల్ ప్లాజాల వద్ద ఇతర వాహనదారులకు అనవసర జాప్యం జరుగుతున్నదని తెలిపింది. తాజా ఆదేశాలను అన్ని టోల్ ప్లాజాల వద్ద ప్రదర్శిస్తామని చెప్పింది. ఫాస్టాగ్ అతికించని వాహనాల రిజిస్ట్రేషన్ల నెంబర్ల సీసీటీవీ ఫుటేజీని రికార్డు చేస్తామని వెల్లడించింది. ప్రామాణిక నిబంధనల ప్రకారం ఫాస్టాగ్ కలిగి ఉండి దాన్ని ప్రదర్శించని వాహనాలకు ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ లావాదేవీలు నిర్వహించరని.. అలాంటి వాహనాల నుంచి రెట్టింపు టోల్ చార్జీ వసూలు చేయడంతో పాటు వాటిని బ్లాక్ లిస్టులో ఉంచొచ్చని తెలిపింది. విండ్‌షీల్డ్‌కు ఫాస్టాగ్‌ను అతికించుకొన్నారా లేదా అనే విషయాన్ని వాటిని జారీ చేసే బ్యాంకులు కూడా పరిశీలించాలని ఎన్‌హెచ్ఏఐ తన ఆదేశాల్లో పేర్కొంది.

సీబీఐ దర్యాప్తు చేయాలంటే మా అనుమతి తప్పనిసరి

మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు

భోపాల్, జూలై 18: బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. తమ రాష్ట్ర పరిధిలో సీబీఐ ఏదైనా కేసును దర్యాప్తు చేయాలనుకుంటే ముందుగా తమ నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం మంగళవారం ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ ఉత్తర్వులు జూలై 1 నుంచి అమలులోకి వచ్చినట్టు పేర్కొంది. ఇంతవరకు విపక్షాలు అధికారంలో ఉన్న బెంగాల్, తమిళనాడు, పంజాబ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాలు మాత్రమే తమ రాష్ట్రాల్లో కేసుల దర్యాప్తునకు తమ అనుమతి తీసుకోవాలంటూ ఆంక్షలు విధించగా, ఇప్పుడు బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్ ఈ తరహా ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. కొత్త న్యాయ చట్టాల ప్రకారం ఈ అనుమతి అవసరం.

కొందరు దేవుడిలా మారాలనుకుంటారు

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్

రాంచీ, జూలై 18: ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. జార్ఖండ్‌లోని బిష్ణుపూర్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'ఆశకు అంతు లేదు. జనం సూపర్‌మ్యాన్ అవాలనుకుంటారు. కానీ అక్కడితో ఆగిపోరు. ఆ తర్వాత దేవత అవాలని, అనంతరం భగవంతుడిగా మారాలని కోరుకుంటారు. అయితే భగవంతుడు.. తాను 'విశ్వరూపుడిని' అని అంటారు. విశ్వరూపం కన్నా పెద్దది ఇంకా ఏదైనా ఉందేమో ఎవరికీ తెలియదు. కార్యకర్తలు దీనిని అర్థం చేసుకోవాలి. ఎల్లవేళలా మరింత ఎక్కువగా శ్రమించాలి' అన్నారు. అయితే, భాగవత్ చేసిన వ్యాఖ్యలు ప్రధాని మోదీని ఉద్దేశించిన వేనని కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నది.

నిద్ర సరిగా లేకపోతే డయాబెటిస్ ముప్పు

న్యూఢిల్లీ : వారం రోజులు సరిగా నిద్ర లేకపోతే టైప్-2 డయాబెటిస్ ముప్పు పెరుగుతుందని తాజా అధ్యయనం హెచ్చరించింది. నిద్ర సమయం గంట తగ్గినా.. వృద్ధులు, మధ్య వయస్కులు డయాబెటిస్ బారినపడే ముప్పు 34 శాతం పెరుగుతుందని తెలిపింది. జీవనశైలిని మార్చుకోవటం ద్వారా డయాబెటిస్ రాకుండా చూసుకోవచ్చునని పేర్కొన్నది. 84 వేల మందికి సంబంధించి బయో బ్యాంక్ డాటా బేస్ ఆధారంగా, పరిశోధకులు కీలక విషయాలు కనుగొన్నారు. 'డయాబెటిస్ కేర్' జర్నల్ వార్తా కథనం ప్రకారం, ఎక్కువ సేపు నిద్రపోతున్న వారిలో జన్యుపరంగా డయాబెటిస్ ముప్పు తక్కువగా ఉందని సైంటిస్టులు గుర్తించారు.

సీఎస్ఐఆర్ పరీక్షలోనూ అక్రమాలు?

- **ఎస్‌ఓ, ఏఎస్‌ఓ నియామకాలకు జూలై 7న పరీక్ష నిర్వహణ**
- **బ్లాక్‌లిస్ట్ అయిన కంపెనీకి ఎగ్జామ్ కాంట్రాక్టు అప్పగింత**
- **అవకతవకలకు అవకాశం కల్పించేలా సాఫ్ట్‌వేర్**
- **కొందరికి పరీక్ష సిబ్బంది సహకరించినట్టు ఆరోపణలు**
- **క్లాస్‌రూములా పరీక్ష కేంద్రం.. వీడియో వైరల్**
- **సీఎస్ఐఆర్ పరీక్షలో అక్రమాలపై 'ది వైర్' వెబ్‌సైట్ కథనం**



అభ్యర్థులకు కొందరు సిబ్బంది సహకరిస్తున్నట్టు ఉన్న వీడియో దృశ్యాలు

న్యూఢిల్లీ, జూలై 18: నీట్-యూజీ, నెట్ పరీక్షల్లో అక్రమాలపై సర్వత్రా ఆందోళన కొనసాగుతుండగానే సీఎస్ఐఆర్ నియామక పరీక్షలోనూ అవతకవకలు జరిగాయనే అంశం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి 'ది వైర్' పరిశోధనాత్మక కథనం ప్రచురించింది. ఈ కథనం ప్రకారం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షుడిగా ఉండే కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్(సీఎస్ఐఆర్)లో సెక్షన్ ఆఫీసర్(ఎస్ఓ), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఏఎస్ఓ) ఉద్యోగాల భర్తీకి జూలై 7న రెండో దఫా పరీక్ష జరిగింది. పరీక్ష నిర్వహించడంలో సీఎస్ఐఆర్ పూర్తిగా విఫలమైందనే వాదనలు వినిపిస్తున్నాయి.

బ్లాక్‌లిస్ట్ అయిన కంపెనీకి కాంట్రాక్టు

మొదటి విడత పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు రెండో విడతగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీపీటీ) నిర్వహించారు. ఈ పరీక్ష నిర్వహించే కాంట్రాక్టును గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ఎడ్యుటెస్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి సీఎస్ఐఆర్ అప్పగించింది.

అయితే, ఈ సంస్థను గతంలోనే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో చేర్చింది. మొదటి దఫా పరీక్షపై ఆరోపణలు వచ్చినప్పటికీ రెండో దఫా పరీక్ష నిర్వహించే బాధ్యతలను కూడా ఈ కంపెనీకే సీఎస్ఐఆర్ ఇచ్చింది. ఈ కంపెనీ గుజరాత్‌కు చెందిన బీజేపీ సన్నిహితులదిగా 'ది వైర్' పేర్కొన్నది. ఈ కంపెనీ వ్యవస్థాపకుడు సురేశ్‌చంద్ర ఆర్య అధ్యక్షుడిగా ఉన్న ఓ సంఘం కార్యక్రమాలకు గతంలో ప్రధాని మోదీ సైతం హాజరయ్యారని తెలిపింది. ఈ సంస్థ ఎండీ వినీత్ ఆర్య గతంలో ఓ పేపర్ లీక్ కేసులో జైలుకు కూడా వెళ్లినట్టు వైర్ తన కథనంలో తెలియజేసింది.

అక్రమాలకు తావిచ్చేలా సాఫ్ట్‌వేర్

సీపీటీ పరీక్ష జరుగుతున్నప్పుడు పరీక్ష కేంద్రాల్లో తీసిన ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారాయి. అభ్యర్థులు గుంపులుగా ఉండటం, మాట్లాడుకుంటున్నట్టు వీటిల్లో కనిపిస్తున్నది. సాధారణంగా సీపీటీ పరీక్ష జరిగేటప్పుడు కంప్యూటర్ మొత్తంపై అభ్యర్థులకు నియంత్రణ ఉండొద్దు. కేవలం పరీక్ష జరిగే వెబ్‌పేజీ మాత్రమే కనిపించాలి. కానీ, ఈ పరీక్ష జరిపిన సాఫ్ట్‌వేర్ అక్రమాలకు అవకాశం కల్పించేలా ఉందని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. కంప్యూటర్‌లోని వేరే ఫైల్స్‌పై అభ్యర్థులకు నియంత్రణ లభించేలా సాఫ్ట్‌వేర్ ఉందని, పెన్‌డ్రైవ్ కూడా వినియోగించే అవకాశం ఉందని చెప్పున్నారు. పరీక్ష నిర్వహించిన సిబ్బంది కొందరు అభ్యర్థులకు సహకరించారని సైతం పలువురు ఆరోపించారు.

---

100 మందితో రండి..

ప్రభుత్వాన్ని ఏర్పాటుచేద్దాం

బీజేపీ ఎమ్మెల్యేలకు అఖిలేశ్ ఆఫర్

లక్నో, జూలై 18: ఉత్తరప్రదేశ్ అధికార బీజేపీలో అసంతృప్తి జ్వాలలు ఆ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇదే అంశంపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ 'ఎక్స్' వేదికగా గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు పార్టీ మారాలని సూచించాడు. 'వర్షాకాలం ఆఫర్ ఇది: 100 మందితో రండి. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయండి' అంటూ అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. బీజేపీలో సీఎం యోగిపై అసంతృప్తిగా ఉన్నవారిని ఉద్దేశించి తాను ఈ మాటలు చెప్పానని అన్నారు.

జాహ్నవి కందుల కేసులో..

పోలీస్ అధికారి డిస్మిస్

సియాటెల్: భారతీయ విద్యార్థిని మరణంపై నవ్వడమే కాక, అనుచిత వ్యాఖ్యలు చేసిన అమెరికా పోలీస్ అధికారిని ఎట్టకేలకు విధుల నుంచి తప్పించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జాహ్నవి కందుల (23) గత ఏడాది జనవరి 23న రోడ్డును దాటుతుండగా సియాటెల్ పోలీస్ అధికారి ఒకరు నడుపుతున్న పోలీస్ వాహనం ఢీకొనడంతో మరణించింది. ఆ సమయంలో డ్రైవర్ వాహనాన్ని 74 కి.మీ వేగంతో నడుపుతున్నాడు. అయితే ఆమె మరణంపై పోలీస్ అధికారి డేనియల్ అడెరెర్ బిగ్గరగా నవ్వుతూ ఎగతాళిగా మాట్లాడాడు. అతని చర్యపై అప్పట్లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. దీంతో డేనియల్‌ను అప్పట్లో సస్పెండ్ చేసిన అధికారులు తాజాగా అతడిని విధుల నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై సియాటెల్ పోలీస్ శాఖ చీఫ్ స్యూ రహర్ మాట్లాడుతూ డేనియల్ చేసిన వ్యాఖ్యలు పోలీసు శాఖకు అవమానమని అన్నారు.

ఆస్ట్రేలియాలో నీట మునిగి

ఇద్దరు తెలుగు విద్యార్థుల మృతి

సిడ్నీ, జూలై 18: ఆస్ట్రేలియాలో జలపాతం వద్ద ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందారు. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్లిన ఇద్దరు విద్యార్థులు మంగళవారం క్వీన్స్‌ల్యాండ్‌లోని మిల్లా మిల్లా జలపాతం వద్ద నీటమునిగి మృతి చెందారు. వారిని ఏపీలోని బాపట్ల జిల్లాకు చెందిన చైతన్య ముప్పరాజు, ప్రకాశం జిల్లాకు చెందిన సూర్య తేజ బొబ్బగా గుర్తించారు. వారితో పాటు ఉన్న మరో విద్యార్థి షాక్‌లో ఉండటంతో అతని నుంచి వివరాలేవీ తెలియరాలేదు. వారిద్దరి మృతదేహాలు నీటిలో గల్లంతయ్యాయని, వాటి కోసం గాలిస్తున్నట్టు క్వీన్స్‌ల్యాండ్ పోలీసులు తెలిపారు. కాగా, అంత్యక్రియలు, మృతదేహాల తరలింపునకు అయ్యే ఖర్చు కోసం స్నేహితులు ఆన్‌లైన్‌లో విరాళాల సేకరణ చేపట్టారు.

సమీర్ సిద్ధరామయ్య

నా పిల్లలు కర్ణాటకలో ఉద్యోగానికి అర్హులు కారా?

స్థానిక కోటా బిల్లుపై ఫోన్‌పే సీఈవో ఆగ్రహం

న్యూఢిల్లీ, జూలై 18: ప్రైవేట్ రంగంలో స్థానికులకు సింహ భాగం ఉద్యోగాలు కల్పించాలన్న కర్ణాటక కాంగ్రెస్ సర్కారు స్థానిక కోటా బిల్లుపై ఫోన్‌పే సీఈవో సమీర్ నిగమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఉద్యోగం కారణంగా వివిధ రాష్ట్రాల్లో నివసించిన తన లాంటి వారికి ఈ బిల్లు అసమంజసమని తెలిపారు. 'మా నాన్న భారత నౌకాదళ ఉద్యోగిగా దేశమంతటా పనిచేశారు. నేను ఏ రాష్ట్రంలోనూ 15 ఏండ్ల కంటే ఎక్కువ నివసించలేదు' అని ఆయన బుధవారం ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. 'నేను కొన్ని కంపెనీలు స్థాపించి దేశ వ్యాప్తంగా 25 వేల ఉద్యోగాలు సృష్టించాను. అయినప్పటికీ కర్ణాటకలో పెరిగిన నా పిల్లలు ఇక్కడి ఉద్యోగాలకు అర్హులు కారా' అని ప్రశ్నించారు. కర్ణాటక ప్రభుత్వ ప్రయత్నాలు సిగ్గుచేటని మండిపడ్డారు.

ముస్లింలను దేశంలో ఉండనివ్వటం పెద్ద తప్పు

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

న్యూఢిల్లీ, జూలై 18: కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ముస్లింలను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'దేశ విభజన జరిగాక.. ముస్లింలను భారత్‌లో ఉండనివ్వటం పెద్ద తప్పు' అంటూ వ్యాఖ్యానించారు. '1947లోనే ముస్లింలందర్నీ పాకిస్థాన్‌కు పంపినట్టయితే, భారతదేశం మరోలా ఉండేది. అలా జరగకపోవటం దేశానికి దురదృష్టకరంగా మారింది. ఈ దేశంలో ముస్లింలను ఉండనివ్వటం పెద్ద తప్పు' అని అన్నారు. ఆయన వ్యాఖ్యల్ని ఆర్ఎస్ఎస్ మ్యాగజైన్ 'పాంచజన్య' సోషల్ మీడియా 'ఎక్స్'లో షేర్‌చేసింది.

చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం నేరం కాదు : హైకోర్టు

బెంగళూరు: ఆన్‌లైన్‌లో చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టంలోని సెక్షన్ 67బీ ప్రకారం నేరం కాదని కర్ణాటక హైకోర్టు తెలిపింది. ఇటువంటి మెటీరియల్‌ను ప్రచురించడం లేదా ప్రసారం చేయడం మాత్రమే నేరం అవుతుందని చెప్పింది. 2022 మార్చిలో నిందితుడు చైల్డ్ పోర్నోగ్రఫీ వెబ్‌సైట్‌ను చూసినట్లు సైబర్, ఎకనమిక్, నార్కొటిక్స్ పోలీసులు నమోదు చేసిన కేసును రద్దు చేసింది. పిటిషనర్ తన వాదనలో, పోర్నోగ్రఫీకి బానిసనయ్యానని, అయితే, ఆ మెటీరియల్‌ను ఇతరులకు పంపించలేదని చెప్పారు.

స్ట్రాంగ్ రూమ్‌కు జగన్నాథుడి ఆభరణాలు

రత్న భాండాగారం నుంచి తరలింపు

పూరీ, జూలై 18: పూరీ జగన్నాథ్ ఆలయంలోని రత్న భాండార్‌లో ఉన్న ఆభరణాలను బయటకు తీశారు. 46 ఏండ్ల తర్వాత జూలై 14న మొదటిసారి రత్న భాండార్‌లోని లోపలి గదిని తెరిచిన దేవాలయ అధికారులు గురువారం మరోసారి తెరిచారు. అందులోని ఆభరణాలను ఆలయంలోని తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. ఈ ప్రక్రియకు ఏడు గంటల సమయం పట్టింది. మూడు చెక్క అల్మారాలు, రెండు చెక్క పెట్టెలు, ఒక స్టీల్ అల్మారా, ఒక ఇనుప పెట్టెలో ఆభరణాలను భద్రపరిచి సీల్ వేసినట్టు శ్రీ జగన్నాథ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్(ఎస్‌జేటీఏ) చీఫ్ అరబింద పధీ తెలిపారు. తాము రత్న భాండార్‌లో ఏయే ఆభరణాలు చూశామనేది బయటకు చెప్పబోమని తెలిపారు. రత్న భాండాగారానికి పురావస్తు శాఖ మరమ్మతులు చేపడుతుందని, అనంతరం ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు. కాగా, ముందు జాగ్రత్తగా పాములను పట్టేవారిని, ఒడిశా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, అగ్నిమాపక సిబ్బందిని రప్పించినప్పటికీ వీరి అవసరం పడలేదు. చివరిసారిగా 46 ఏండ్ల కిందట రత్నభాండాగారాన్ని తెరిచారు.

ఎయిడ్స్ పూర్తిగా నయం

జర్మనీ దేశస్థుడికి స్టెమ్ సెల్ చికిత్స విజయవంతం

వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్న ఏడో వ్యక్తి

బెర్లిన్, జూలై 18: ఎయిడ్స్ మహమ్మారి చికిత్సలో మరో ముందడుగు పడింది. జర్మనీకి చెందిన 60 ఏండ్ల వ్యక్తికి ఈ వ్యాధి పూర్తిగా నయమైంది. 40 ఏండ్ల ఎయిడ్స్ చరిత్రలో పూర్తిగా ఈ వ్యాధి బారి నుంచి బయటపడ్డ ఏడో వ్యక్తి ఈయన. బాధితుడికి చేసిన స్టెమ్ సెల్ చికిత్స విజయవంతమైనట్టు వైద్యులు గురువారం ప్రకటించారు. ఇతడికి 2015లో ప్రమాదకరమైన, నొప్పితో కూడుకున్న స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ చేసినట్టు తెలిపారు. హెచ్ఐవీతో పాటు మైలాయిడ్ లుకేమియా ఉన్న వారికి మాత్రమే ఈ చికిత్స చేస్తామన్నారు. ఈ చికిత్స తీసుకున్నప్పటి నుంచి ఇతడి శరీరంలో మళ్లీ వైరస్ జాడలు కనిపించలేదని వైద్యులు తెలిపారు. కాగా, ఎయిడ్స్ బారి నుంచి పూర్తిగా బయటపడ్డ మొదటి వ్యక్తి టిమోతీ రే బ్రౌన్‌కు కూడా లుకేమియా సమస్య ఉండేది. దీంతో 2007లో ఆయనకు కూడా స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. ఆ తర్వాత అతడు ఈ వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్న మొదటి వ్యక్తిగా నిలిచారు.

డెంగ్యూతో బ్రెయిన్ స్ట్రోక్ ముప్పు

రక్తం గడ్డ కట్టే ప్రమాదం

న్యూఢిల్లీ, జూలై 18: దోమల ద్వారా వచ్చే డెంగ్యూ వ్యాధి వల్ల బ్రెయిన్ స్ట్రోక్ ముప్పు కూడా ఉంటుందని వైద్యులు హెచ్చరించారు. ఇన్‌ఫెక్షన్ సోకిన మొదటి రెండు నెలల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువ ఉంటుందని తెలిపారు. సాధారణంగా డెంగ్యూ బాధితుల్లో జ్వరం, ఒళ్లు నొప్పులు, దద్దుర్లు, వాంతులు, వికారం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో డెంగ్యూ ప్రభావం మెదడు, నాడీ వ్యవస్థపై కూడా పడుతుందని, ప్రాణాంతకమైన స్ట్రోక్‌లకు కారణమవుతుందని పలువురు వైద్యులు పేర్కొన్నారు. డెంగ్యూ షాక్ సిండ్రోమ్‌గా పేర్కొనే తీవ్రమైన ప్లాస్మా లీకేజీ వల్ల మెదడు సహా కీలకమైన అవయవాలకు రక్త సరఫరా సరిగ్గా జరగదని, ఇలాంటి పరిస్థితుల్లోనే స్ట్రోక్ ముప్పు ఉంటుందని న్యూరాలజిస్ట్ డాక్టర్ లోమేశ్ భిరుడ్ తెలిపారు. డెంగ్యూ వైరస్ కొన్నిసార్లు నరాల కణాలను ఆక్రమించి పనితీరును దెబ్బతీస్తుందని చెప్పారు. మెదడు, వెన్నెముకలో వాపు ఏర్పడి కణజాలం దెబ్బతినే ప్రమాదం ఉంటుందన్నారు.

పట్టాలు తప్పిన బోగీల వద్ద గుమికూడిన ప్రయాణికులు, స్థానికులు

పట్టాలు తప్పిన చండీగఢ్-డిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్

ముగ్గురు మృతి.. 34 మందికి తీవ్రగాయాలు

యూపీలోని గోండా సమీపంలో ప్రమాదం

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం గోండా రైల్వే స్టేషన్‌కు సమీపంలో చండీగఢ్-డిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. 12 బోగీలు పక్కకు ఒరిగాయి. పట్టాలు తప్పిన బోగీల్లో ఒకటి పూర్తిగా పల్టీలు కొట్టింది. ఈ ప్రమాద ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని వార్తలు వెలువడ్డాయి. 34 మంది తీవ్రంగా గాయపడ్డారని నార్త్ ఈస్టర్న్ రైల్వే జనరల్ మేనేజర్ సౌమ్య మాథుర్ విలేకరులకు తెలిపారు. మృతుల సంఖ్యపై అధికారులు, మంత్రులు రకరకాలుగా మాట్లాడారు. యూపీ డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్, జిల్లా కలెక్టర్ నేహా శర్మ.. నలుగురు చనిపోయారని వెల్లడించారు. రైల్వే అధికారి.. ముగ్గురు మృతి చెందారని ప్రకటించారు. ఆ తర్వాత మృతుల సంఖ్యను ఒకటికి తగ్గించారు. క్షతగాత్రులను వెంటనే దవాఖానకు పంపి వైద్య చికిత్స అందిస్తున్నామని బ్రజేశ్ పాఠక్ చెప్పారు. జిల్లా అధికారులు, విపత్తు సహాయక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. 'బుధవారం రాత్రి చండీగఢ్ నుంచి బయల్దేరిన రైలు నెంబర్ 15904 చండీగఢ్-డిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్, గురువారం మధ్యాహ్నం 2.37 గంటలకు పట్టాలు తప్పింది' అని రైల్వే శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రైలు ప్రమాదంపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రయాణికుల భద్రత కోసం కేంద్రం ఏం చేస్తున్నది? వరుస రైలు ప్రమాదాలు జరుగుతున్నా.. కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి ఎప్పుడొస్తుంది?' అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మోదీ సర్కార్ ఒక క్రమపద్ధతిలో రైల్వేను ప్రమాదంలోకి నెట్టింది అనేందుకు తాజా ఘటనే ఉదాహరణ' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు.

ఆయుష్షు పెంచే ఔషధం

ఎలుకలపై విజయవంతమైన ప్రయోగం

వృద్ధాప్యాన్ని నెమ్మదింపజేస్తున్నట్టు గుర్తించిన సైంటిస్టులు

లండన్, జూలై 18: మనుషుల జీవితకాలాన్ని పెంచాలనే లక్ష్యంతో అభివృద్ధి చేసిన ఓ ఔషధం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఎలుకలపై విజయవంతమైన ఈ ఔషధ ప్రయోగం మనుషుల ఆయుష్షును కూడా పెంచవచ్చనే ఆశలు చిగురిస్తున్నాయి. లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీకి చెందిన ఎంఆర్‌సీ ల్యాబొరేటరీ ఆఫ్ మెడికల్ సైన్స్, సింగపూర్‌లోని డ్యూక్-ఎన్‌యూఎస్ మెడికల్ స్కూల్‌కు చెందిన పరిశోధకులు తయారుచేసిన ఈ ఔషధానికి సంబంధించిన వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

25 శాతం పెరిగిన ఎలుకల జీవితకాలం

పరిశోధకులు ఈ ప్రయోగంలో భాగంగా ఇంటర్‌ల్యూకిన్-11 అనే ప్రొటీన్‌పై దృష్టి సారించారు. వయసు పెరుగుతున్న కొద్దీ శరీరంలో దీని స్థాయిలు పెరుగుతాయి. వృద్ధాప్యానికి ఇదే ప్రధాన కారణమని పరిశోధకులు గుర్తించారు. ఇంటర్‌ల్యూకిన్-11 ఉత్పత్తిని అడ్డుకునేందుకు ఒక ఔషధాన్ని అభివృద్ధి చేశారు. దీనికి 75 వారాల వయసు ఉన్న ఎలుకలపై ప్రయోగించారు. ఇది మనుషులకు 55 ఏండ్ల వయసుతో దాదాపుగా సమానం. ఈ ఔషధాన్ని ప్రయోగించిన ఎలుకల జీవితకాలం 20-25 శాతం పెరిగిందని పరిశోధకులు తెలిపారు. ఎలుకల కండరాల పనితీరు మెరుగయ్యిందని, సన్నగా, చురుగ్గా మారాయని, వెంట్రుకలు ఎక్కువగా వచ్చాయని గుర్తించినట్టు చెప్పారు. ఎలుకలపై సత్ఫలితాలను ఇచ్చిన ఈ ఔషధాన్ని ప్రస్తుతం మనుషులపై కూడా ప్రయోగిస్తున్నారు. ముందుగా ఊపిరితిత్తుల ఫైబ్రోసిస్‌తో బాధపడుతున్న వారికి ఈ ఔషధం ఇచ్చామని, ఇది మనుషులు తీసుకోవడానికి సురక్షితమే అనేది తాము గుర్తించినట్టు ప్రొఫెసర్ స్టువర్ట్ కుక్ తెలిపారు. అయితే, మనుషులపై ఇది ఎలా పని చేస్తుందనే తేలాల్సి ఉంది.



మీట నొక్కితే మరణమే!

సూసైడ్ క్యాప్సూల్ తయారుచేసిన స్విట్జర్లాండ్ సంస్థ

మరికొన్ని నెలల్లో ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం

జురిచ్, జూలై 18: ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారు నొప్పి లేకుండా తనువు చాలించేలా చేసే సూసైడ్ క్యాప్సూల్ మరికొన్ని నెలల్లో స్విట్జర్లాండ్‌లో అందుబాటులోకి రానున్నది. సార్కో క్యాప్సూల్‌గా పిలిచే ఈ సూసైడ్ మెషీన్‌ను లాస్ట్ రిసార్ట్ ఆర్గనైజేషన్ అనే సంస్థ తయారుచేసింది. ఈ క్యాప్సూల్ పనితీరును దీని సృష్టికర్త ఫిలిప్ నిట్స్‌ఖే వివరించారు. ఆత్మహత్య చేసుకోవాలని అనుకునే వారు క్యాప్సూల్‌లో కూర్చొని మూత పెట్టేసిన తర్వాత.. ఎవరు మీరు? మీరు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో తెలుసా? ఈ బటన్ నొక్కితే ఏమవుతుందో తెలుసా? వంటి మూడు ఆటోమేటెడ్ ప్రశ్నలను క్యాప్సూల్ అడుగుతుంది. వీటికి సమాధానం చెప్పిన తర్వాత.. 'మీరు చనిపోవాలనుకుంటే ఈ బటన్ నొక్కండి' అనే సందేశం వినిపిస్తుంది. బటన్ నొక్కిన 30 సెకన్లలో క్యాప్సూల్‌లో 21 శాతంగా ఉండే ఆక్సిజన్ స్థాయిలు 0.05 శాతానికి పడిపోయి, నైట్రోజెన్ స్థాయిలు పెరిగిపోతాయి. దీంతో మనిషి ఐదు నిమిషాల పాటు స్పృహ కోల్పోయి, తర్వాత మరణిస్తాడు. ఒకసారి బటన్ నొక్కిన తర్వాత ప్రాణాలు దక్కవని ఫిలిప్ తెలిపారు. క్యాప్సూల్ వినియోగించాలంటే కనీసం 50 ఏండ్ల వయస్సు ఉండాలని, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న వారైతే 18 ఏండ్లు దాటాలని చెప్పారు. ఈ క్యాప్సూల్ వినియోగానికి దాదాపు రూ.1,700 ఖర్చవుతాయని ఈ సంస్థ ప్రకటించింది.